క్లుప్తంగా

పనుల పరిశీలన

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో రాష్ట్రదేవాదాయశాఖ కమీషనర్ వెంకట్ రావు సరస్వతినది పుష్కరాల పనుల ఏర్పాట్లు పరిశీలించారు. మంగళవారం ఆయన త్రివేణి సంగమ వద్ద సరస్వతి ఘాటు ఏర్పాట్లు పరిశీలించి, అధికారులకు దిశానిర్దేశం చేశారు. సీఎం రానున్న, నేపథ్యంలో ఏర్పాట్లలో వేగిరం పెంచాలని ఆదేశించారు. ఆయన వెంట దేవ స్థానం సిబ్బంది, అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, విజయలక్ష్మీ తదితరులు ఉన్నారు.

పార్టీ కార్యాలయానికి స్థలం కేటాయించాలి

భూపాలపల్లి రూరల్: జిల్లాకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయానికి అవసరమైన స్థలాన్ని కేటాయించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్‌రెడ్డితో కలిసి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మంగళవారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అశోక్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం ఇచ్చినవారిలో కాంగ్రెస్ రాష్ట్ర, జిల్లా, పట్టణ నాయకులు ఉన్నారు.

నేటినుంచి వేసవి శిబిరం

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పరిధిలోని నేటి(బుధవారం) నుంచి ఆరో తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు వేసవి శిబిరం నిర్వహించనున్నట్లు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు పింగిలి విజయపాల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులకు ఆటలు, కరాటే, సంగీతం, చిత్రలేఖనం, స్పోకెన్ ఇంగ్లీష్ అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మొగుళ్లపల్లి కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులను ఈ శిబిరానికి పంపించాలని కోరారు.

పరామర్శ



చిట్యాల: మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ మండల నాయకుడు ఆరెపల్లి సమ్మయ్య అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మంగళవారం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. అక్కడి పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని మెరుగైనా వైద్యం అందించాలని కోరారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొత్తూరి రాజిరెడ్డి, మండల నాయకులు పాండ్రాల స్వామి, పెరుమాండ్ల రవీందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

కమిటీ ఎన్నిక



వెంకటాపురం(కె): మండల పరిధిలోని చిరుతపల్లిలోని సమ్మక్క–సారలమ్మ ఆలయ కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా నర్సయ్య, కన్వీనర్‌గా నాగేంద్ర ప్రసాద్, కో కన్వీనర్‌గా కోర్స నరసింహమూర్తి, కోశాధికారిగా వెంకటేశ్వర్లు, సంయుక్త కార్యదర్శులుగా చెలే నవీన్, వాసం నాగరాజు, రమేశ్, రామారావు, కోరం జానకిరావును ఎన్నుకున్నారు.

వారం రోజులు.. ఆరు ఇళ్లు

- జిల్లాకేంద్రంలో దొంగల బీభత్సం
- సింగరేణి కార్మిక కాలనీలే టార్గెట్
- సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా ఆగని దొంగతనాలు
- రాత్రి వేళలో పోలీసుల నిఘా అంతంతే..



మిలీనియం క్వార్టర్స్‌లో బీరువా, అలుమారాలను పగులకొట్టిన దొంగలు



ఎంసీ క్వార్టర్స్‌లో తలుపు బేడం ధ్వంసం చేసిన దొంగలు

భూపాలపల్లి అర్బన్: జిల్లాకేంద్రంలో వారం రోజులుగా దొంగలు బీభత్సం సృష్టిస్తున్నారు. జిల్లాకేంద్రంలోని సింగరేణి కార్మికుల ఇళ్లకు కన్నం వేస్తున్నారు. విద్యాసంస్థలకు వేసవి సెలవులు కావడంతో కుటుంబ సభ్యులు సొంత గ్రామాలు, బంధువుల ఇళ్లకు వెళ్లడాన్ని దొంగలు పసిగడుతున్నారు. కొద్దిరోజులుగా వరుసగా దొంగతనాలు జరుగుతున్నాయి. దీంతో కోల్‌బెల్ట్ ఏరియాలో కార్మికులు, అధికారులు మరింత ఆందోళన చెందుతున్నారు. జిల్లాకేంద్రంలో వారం రోజుల్లో ఎనిమిది దొంగతనాలు జరిగాయి. ఈ నెల 8వ తేదిన రాత్రి సింగరేణి మిలీనియం క్వార్టర్స్‌లో నలుగురు కార్మికుల ఇళ్లలో, ఈ నెల 11వ తేదీ రాత్రి సింగరేణి జీఎం కార్యాలయం ఎదురుగా ఎంసీ క్వార్టర్స్‌లో పోలీస్‌స్టేషన్ పక్కనే మరో నాలుగు క్వార్టర్‌లలో అధికారులు, కార్మికుల ఇళ్లలో చోరీలకు పాల్పడ్డారు. ఇళ్ల తాళలను పగులగొట్టి కొన్ని బేడాలను తొలగించి చోరీలకు పాల్పడ్డారు. విలువైన బంగారం, నగదు ఎత్తుకెళ్లడంతో పాటు బైక్, మొబైల్ ఫోన్లను సైతం ఎత్తుకెళ్లారు. రెండు రోజుల్లో దొంగతనానికి పాల్పడింది ఒకే వ్యక్తి అని తెలుస్తోంది.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా..

జిల్లా కేంద్రంలో నేర నియంత్రణ, దొంగతనాలను అదుపు చేసేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలను పెద్దఎత్తున ఏర్పాటు చేశారు. అయినప్పటికీ దొంగతనాలు ఆగడం లేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. గతంలో మాదిరిగానే దొంగతనాలు జరుగుతున్నా పోలీస్ శాఖ ఏం చేస్తుందని చర్చించుకుంటున్నారు. రాత్రి వేళలో పోలీస్ పెట్రోలింగ్ తగ్గినట్లు కనిపిస్తుంది. ఇదే అవకాశంగా తీసుకున్న దొంగలు రెచ్చి పోయి తాళం వేసి ఉన్న ఇళ్లకు కన్నం వేస్తున్నారు.

పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం..

జిల్లా కేంద్రంలో రాత్రి వేళలో నిరంతరం సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం. పట్టణవాసులు, కార్మికులు వేసవి సెలవుల్లో గ్రామాలు, బంధువుల ఇళ్లకు వెళ్లే ముందు ఇంట్లో ఉన్న విలువైన బంగారు, వెండి అభరాలు, డబ్బులను వెంట తీసుకువెళ్లాలి. పోలీసులకు సమాచారం ఇచ్చి వెళ్లాలి. ఇటీవల జరిగిన చోరీలపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి విచారణ చేస్తున్నాం. సీసీ కెమెరాల ఆధారంగా దొంగలను గుర్తించి పట్టుకుంటాం.

– నరేష్‌కుమార్, సీఐ భూపాలపల్లి

షరతులు లేకుండా రుణాలివ్వాలి

- సీపీఐ పట్టణ కార్యదర్శి సోత్కు ప్రవీణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

భూపాలపల్లి అర్బన్: నిరుద్యోగులకు ప్రభుత్వం ఎటువంటి షరతులు విధించకుండా రాజీవ్ యువ వికాసం రుణాలు ఇవ్వాలని సీపీఐ పట్టణ కార్యదర్శి సోత్కు ప్రవీణ్‌కుమార్ కోరారు. జిల్లా కేంద్రంలోని స్థానిక రావి నారాయణరెడ్డి భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సోత్కు ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు రాజీవ్ యువ వికాసం కింద రుణాలు ఇచ్చి సొంతగా వ్యాపారం నిర్వహించుకోవాడానికి రూ.50 వేల నుంచి రూ.4లక్షల వరకు అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చిందన్నారు. దరఖాస్తులు స్వీకరించి, పరిశీలించిన తరువాత సిబిల్ స్కోర్ ఉన్న వాళ్లకే మాత్రమే రుణాలు ఇస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు. రోజు వారి కూలి పనులు చేసుకునే వారికి సిబిల్ స్కోర్ ఏ విధంగా ఉంటుందని ప్రశ్నించారు. దరఖాస్తు చేసుకున్న వాళ్లందరికీ రుణాలు మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు క్యాతరాజు సతీశ్, వేముల శ్రీకాంత్, యాకుబ్ పాషా, పీక రవికాంత్, మేడి శ్రీకాంత్, ఒంటేరు రాజేష్, అజయ్ పాల్గొన్నారు.

రైతులకు నష్టం కలగకుండా చూడాలి

- ఏఓ సురేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న సురేందర్‌రెడ్డి

మొగుళ్లపల్లి: వరి కోసే సమయంలో నిర్ణీత ప్రమాణాలు పాటిస్తూ రైతులకు నష్టం కలగకుండా చూడాలి చూడాలని మండల వ్యవసాయాధికారి సురేందర్ రెడ్డి హార్వెస్టర్ నిర్వాహకులకి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో హార్వెస్టర్ యజమానులకు, డ్రైవర్లకు వరి కోతలో తీసుకోవాల్సిన అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. తప్పనిసరిగా ఆర్‌పీఎం 18 కంటే తక్కువ పెట్టొద్దని అన్నారు. తక్కువ పెడితే ధాన్యంలో తాలు, మట్టి, గడ్డి ధాన్యంలో చేరుతుందని కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు జోష్న్న తదితరులు పాల్గొన్నారు.

'హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వం'

- సీపీఎం జిల్లా కార్యదర్శి సాంబశివ

వెంకటాపురం(కె): ఈనెల కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఎం) మండల కమిటీ సమావేశం కుమ్మరి శీను అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి బీరెడ్డి సాంబశివ హాజరై మాట్లాడారు. 20న నిర్వహించే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్రంలో బీజేపీ నియంత పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి గ్యానం వాసు, కట్ల నర్సింహాచారి, చిట్టెం ఆదినారాయణ, కంతం సత్యం, తోట నాగేశ్వరరావు, బాబురావు పాల్గొన్నారు.

సుందరీమణుల పర్యటనకు సిద్ధం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ దివాకర టీఎస్

వెంకటాపురం(ఎం): మిస్ వరల్డ్–2025 పోటీల్లో పాల్గొనేందుకు హైదరాబాద్ వచ్చిన సుందరీమణులు నేడు(బుధవారం) రామప్ప ఆలయాన్ని సందర్శించనున్న నేపథ్యంలో రామప్పలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ దివాకర టీఎస్ పేర్కొన్నారు. రామప్ప ఆలయాన్ని మంగళవారం కలెక్టర్ సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ నుంచి రామప్ప హరిత హోటల్‌కు చేరుకొని అక్కడి నుంచి సంప్రదాయ దుస్తులలో రామప్ప ఆలయాన్ని సందర్శిస్తారని తెలిపారు. రామప్ప ఆలయ సంస్కృతిని వివరించే విధంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పనులను పూర్తి చేశారన్నారు. సుందరీమణులు పర్యటన నేపథ్యంలో రామప్ప ఆలయానికి సందర్శకుల అనుమతి లేదన్నారు. భక్తులు, పర్యాటకులు సహకరించాలని కోరారు. భద్రత దృష్ట్యా రామప్ప నుంచి ఐదు కిలోమీటర్ల పరిసర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలు ఎగురవేయడం పూర్తిగా నిషేధమన్నారు.

'దళితులపై చిన్నచూపు సరికాదు'

కాటారం: దళిత ఎంపీ అయిన గడ్డం వంశీకృష్ణ తోటి దళిత వర్గానికి చెందిన నాయకులను చిన్న చూపు చూడటం సరికాదని కాంగ్రెస్ నాయకుడు భూపెల్లి రాజు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రాజు మాట్లాడారు. కాటారం మండలంలో పలువురి కుటుంబాల పరామర్శకు వచ్చిన పెద్దపల్లి ఎంపీ దళిత నాయకులకు సమాచారం ఇవ్వలేదన్నారు. దళితులపై వివక్ష జరుగుతుందని పలుమార్లు ఎంపీ మాట్లాడటం జరిగిందని కానీ ఆయన తోటి దళితులకు మండలానికి వస్తున్నట్లు సమాచారం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని దళితుల పక్షాన తెలియజేస్తున్నట్లు రాజు పేర్కొన్నారు.

వైద్య పరీక్షలు



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని ఆరోగ్య మహిళ కేంద్రంలో మంగళవారం వైద్యాధికారి స్నేహరెడ్డి ఆధ్వర్యంలో మహిళలకు వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా 75 మందికి పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం 12 మంది వద్ద నుంచి రక్త నమూనాలను సేకరించి పరీక్షలకు ములుగు ఏరియా వైద్యశాలకు పంపించారు. అనంతరం చిరుతపల్లి గ్రామంలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు వినయ్, యాకలక్ష్మితో పాటు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం కష్టపడిన వారికే పదవులు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



భూపాలపల్లి రూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు లభిస్తుందని, పైరవీలతో పదవులు రావని, అర్హతలు ఉన్న వారికే పదవులు వస్తాయని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు రామచంద్రయ్య అధ్యక్షతన సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ ప్రక్షాళనలో పీసీసీ పరిశీలకుల బాధ్యత అత్యంత కీలకమైందన్నారు. అనంతరం పట్టణంలోని 25వ వార్డులో ఎర్రం సతీస్ ఇంట్లో హనుమాన్ స్వాములకు భిక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు.

పేద ప్రజల సంక్షేమమే లక్ష్యం

చిట్యాల: పేద ప్రజల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రేగొండ: కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కష్టపడ్డ వారికి తప్పకుండా అవకాశాలు లభిస్తాయని, పైరవీలతో పదవులు రావని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఉమ్మడి రేగొండ మండల కాంగ్రెస్ పార్టీ నేతలతో సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణే కాంగ్రెస్ సిద్ధాంతమని తెలిపారు. ఈ సందర్భంగా రేగొండ, కొత్తపల్లిగోరి మండలాలలోని వివిధ గ్రామాలకు చెందిన 55 మంది లబ్ధిదారులకి రూ.19,85,000 విలువ కలిగిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ కార్పోరేషన్ చైర్మన్ ప్రకాష్‌రెడ్డి, జిల్లా పరిశీలకులుగా ఇనగాల వెంకట్రామరెడ్డి, మాసంపెల్లి లింగాజీ, రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టయ్య, జిల్లా, మండల నాయకులు సూదనబోయిన ఓంప్రకాష్, పున్నం రవి, మొట్టె కిరణ్ పటేల్, రొంటాల వెంకటస్వామి, బండారి దేవేందర్, మేకల భిక్షపతి, కుమారస్వామి, గండి తిరుపతి, వీరబ్రహ్మం, ప్రేమాజీ, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

భూ భారతి రెవెన్యూ అవగాహన సదస్సులను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం మండలంలోని రామన్నగూడెంలో ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ధరణిలో అనేక లోపాలున్నాయని గుర్తించి ప్రజా ప్రభుత్వం నూతన చట్టం తీసుకువచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మతల్లి ఆశీస్సులు అందరికి ఉండాలి

టేకుమట్ల: ఎల్లమ్మతల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం మండలంలోని అంకుషాపూర్‌లో గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రారంబోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్లమ్మతల్లి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోటగిరి సతీశ్ గౌడ్, మాజీ జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, మండల నాయకులు నాంపెల్లి వీరేశం, చిరంజీవి, శాస్త్రాల కిరణ్, వంగ నరేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ భక్తుల నగర సంకీర్తన



వెంకటాపురం(ఎం): మండలంలోని ఎల్లారెడ్డిపల్లెలో హనుమాన్ భక్తులు నగర సంకీర్తన చేశారు. హనుమాన్ చిత్రపటంతో గ్రామంలో వీధుల్లో తిరుగుతూ భజన పాటలు పాడుతూ భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన చేశారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ భక్తులు బేతి సతీష్, మెంతుల వంశీ, కొలనుపాక శివుడు, కుమార్, సదానందం, మధు, సాంబయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి విద్యుత్ వెలుగులు



రాజగోపురానికి విద్యుత్ కాంతులు



దక్షిణ ద్వారం గోరం, మండపానికి విద్యుత్ వెలుగులు

కాళేశ్వరం: ఈనెల 15 నుంచి ప్రారంభం కానున్న సరస్వతినది పుష్కరాలకు కాళేశ్వరం దేవస్థానం ప్రధాన ఆలయంతో పాటు ప్రాకారదేవతలు, గోపురాలకు రంగురంగుల విద్యుత్ వెలుగులు ఏర్పాటు చేశారు. మంగళవారం సాయంత్రం విద్యుత్‌వెలుగులు ప్రసరించి జిగేల్‌మంటున్నాయి.

కాళేశ్వరంలో వసతికి ఏర్పాట్లు



కాళేశ్వరంలో నిర్వహించే సరస్వతినది పుష్కరాల్లో వసతికి ఏర్పాట్లు చేస్తున్నారు. సింగరేణి గెస్ట్‌హౌస్‌కు మరమ్మతులు చేపట్టారు. ఏసీలు బిగిస్తున్నారు. మొత్తం 8 వరకు గదులు ఉన్నాయి. వేములవాడ రాజరాజేశ్వరవసతి గృహంలో 12 వరకు వసతి గదులు ఉన్నాయి. నూతనంగా నిర్మాణం పూర్తయిన 86 గదుల నిర్మాణం పనులు తుదిదశకు చేరాయి. హరిత హోటల్‌లో మొత్తం 21 గదులు ఉన్నాయి. ప్రైవేటు లాడ్జీల్లో సుమారు 200వరకు వసతి గదులు ఏసీ, నాన్ ఏసీ గదులు ఉన్నాయి.

ఎగ్జిబిషన్ స్టాళ్లు రెడీ..



కాళేశ్వరంలో 12 రోజుల పాటు సరస్వతినది పుష్కరాల్లో ప్రభుత్వం ఎగ్జిబిషన్ నిర్వహించడానికి ఏర్పాట్లు చేసింది. ఈమేరకు మంగళవారం టెంట్లు నిర్మాణం చేశారు. అందులో పుస్తకాల ప్రదర్శన, ఖాదీవస్త్రాలు, ఫుడ్‌కోర్టులు, చిన్నారుల ఆట వస్తువులు తదితర ఏర్పాట్లు జరుగతున్నాయి.

సీఎం రాకకు గోదావరిలో కోర్డినేషన్స్ చెక్



సరస్వతినది పుష్కరాల ప్రారంభం రోజు సీఎం రేవంత్ దంపతులు రానున్న నేపథ్యంలో త్రివేణి సంగమంలో పుష్కరాలు స్నానాలు ఆచరించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం పోలీసులు నాటుపడవల ద్వారా సంగమంలో కోర్డినేషన్స్ చెక్ చేశారు. సీఎం ఎక్కడ స్నానం చేయాలి. ఎంత దూరంలో నీటిలో మునిగి చేయాలనే ఏర్పాట్లు ఇరిగేషన్ ఇంజనీర్లతో కలిసి పోలీసులు పరిశీలించారు.

గోదావరి ఇసుకలో మట్టిరోడ్డు



భక్తుల సౌకర్యార్థం కాళ్లు ఎండ వేడికి తట్టుకునే లాగా మట్టిరోడ్డు నిర్మాణం చేపట్టారు. మట్టిపై క్వాయర్ మాట్ వేస్తారు. దీంతో నీటివద్దకు నేరుగా వెళ్లి స్నానాలు చేయడానికి వీలుంది.

హైమాస్ట్ లైట్లకు ఏర్పాట్లు



గోదావరిలో పుష్కరాల సందర్భంగా భక్తులకు సాయంత్రం ఇబ్బందులు లేకుండా హైమాస్ట్ లైట్లు, వేసవి వేడిని తట్టుకోవడానికి చలువ పందిర్లు ఏర్పాటు చేస్తున్నారు.

ముచ్చటగొలుపుతున్న గోడ చిత్రాలు



పుష్కరాల సందర్భంగా ఆలయ పరిసరాల్లోని గోడలకు చిత్రాలు చూపరుల ఆకట్టుకుంటున్నాయి. దేవతామూర్తుల చిత్రాలతో పాటు భక్తిభావం ఉట్టిపడే చిత్రాలు భక్తులను ముచ్చటగొలుపుతున్నాయి. గోడలన్నింటికి చిత్రాలతో సరికొత్త శోభ నెలకొంది.



సరస్వతి పుష్కర ఘాటు వద్ద ఏర్పాటు చేసిన జ్ఞానదీపం

కాళేశ్వరం గ్రామస్తుల ప్రయాణాలు ఎలా!

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో ఈ నెల 15 నుంచి 26 వరకు నిర్వహించనున్న సరస్వతినది పుష్కరాల నేపథ్యంలో పోలీసులు భద్రత కట్టుదిట్టం చేసి, భక్తుల వాహనాల రాకపోకలకు రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉండడంతో పోలీసులు భక్తుల వాహనాలను లోపలికి అనుమతించకుండా పార్కింగ్ స్థలాలను సిద్ధం చేస్తున్నారు. పోలీసులు వాహనాలను లోపలికి అనుమతించకుంటే స్థానికులు తమ వాహనాలను తీసుకొని బయటకు వెళ్లడం ఎలా అనే ప్రశ్నలు వస్తున్నాయి. బయటకు వెళ్లి మళ్లీ తిరిగి గ్రామానికి రావాలంటే ఏదైన వాహన పాసులు ఇస్తే సౌకర్యంగా ఉంటుంది. లేదంటే కష్టతరంగా మారే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే సమాలోచన చేసి గ్రామ ప్రజల వాహనాలకు పాసులు ఇవ్వాలని కోరుతున్నారు. వాహన పాసులు లేదా ఆధార్ కార్డులతో వాహనాలను అనుమతించాలని పేర్కొంటున్నారు.